సాక్షి పల్నాడు

మంగళవారం । 15 । అక్టోబర్ । 2024




కాళీమాత ఊరేగింపు

తెనాలి: స్థానిక శివాజీ చౌక్‌లోని శ్రీకాళీమాత దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా సోమవారం పుర వీధుల్లో అమ్మవారి విగ్రహ ఊరేగింపును నిర్వహించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట:పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 33,516 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 30,225 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 588.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 3,371 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

పూర్ణాహుతితో ముగిసిన దసరా ఉత్సవాలు



అమరావతి:అమరావతిలోని శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి శ్రీ దేవీ శరన్నవ రాత్రోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. తొలుత చండీదేవి సమేత అమరేశ్వరస్వామి వారికి నంది మండపంలో చూర్ణోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు తిరువంజనం చేసి నూతన వస్త్రాలంకరణ చేసి వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ మాట్లాడుతూ పంచాహ్నిక దీక్షతో నిర్వహించే దసరా ఉత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు. రాత్రి 10 గంటలకు నిర్వహించే ధ్వజావరోహణ కార్యక్రమంతో స్వామివారి ఏకాంతసేవ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. వసంతోత్సవం అనంతరం స్వామివారిని పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ ఈఓ వేమూరి గోపీనాథశర్మ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఓగేరు వాగులోకి దూసుకెళ్లిన లారీ



రొంపిచర్ల: మండలంలోని మర్రిచెట్టుపాలెం గ్రామ సమీపంలో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ బోల్తా కొట్టి డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఒంగోలు వైపు నుంచి కెమికల్ లోడ్‌తో హైదరాబాదుకు వెళుతున్న లారీ మర్రిచెట్టుపాలెం సమీపంలోకి రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓగేరు వాగులోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ నడుపుతున్న డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు భావిస్తున్నారు.

మల్లేశ్వరుని సేవలో ఐజీ రామకృష్ణ



పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని సోమవారం రాష్ట్ర ఇంటిలిజెన్స్ ఐజీ పి.హెచ్.డి. రామకృష్ణ దర్శించుకున్నారు. ఆయనకు ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్, అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఐజీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు, పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఉప కమిషనర్ స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి, చిత్రపటం బహూకరించారు.

నేడు ఎంపీహెచ్‌ఏలకు ప్రమోషన్ కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్)గా పనిచేస్తున్న వారికి మంగళవారం ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ కె.సుచిత్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎనిమిది మంది ఎంపీహెచ్ఏ ఫిమేల్ అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి స్టాఫ్ నర్సులుగా ప్రమోషన్ అందజేస్తామని ఆమె పేర్కొన్నారు.

17 నుంచి రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : స్థానిక బీఆర్ స్టేడియంలో ఈ నెల 17 నుంచి 19 వరకు జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఎస్.సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్‌ల విభాగంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 250 మంది ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కోచ్ అఫ్రోజ్ ఖాన్ నంబర్ 8143143222ను సంప్రదించాలని సూచించారు.

పచ్చ నేతలకే కిక్కు

పూర్తయిన మద్యం లాటరీ ప్రక్రియ

- జేసీ సూరజ్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాల కేటాయింపు
- జిల్లాలో 129 మద్యం దుకాణాలలో 90 శాతానికి పైగా టీడీపీ సిండికేట్లు కైవసం
- మిగిలిన వాటిని భయపెట్టి లాక్కొనేందుకు వ్యూహాలు
- టీడీపీ కార్యకర్తలైనా కప్పం కట్టాల్సిందే అంటున్న ప్రజాప్రతినిధులు
- కొందరు భాగస్వామ్యం, మరికొందరు నగదు అప్పజెప్పమని ఆదేశాలు
- ఏడుగురు మహిళలకు తొమ్మిది దుకాణాలు కేటాయింపు



నరసరావుపేట టౌన్ హాల్‌లో మద్యం దుకాణాలకు లాటరీ విధానంలో విజేతను ఎంపిక చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్, ఎక్సైజ్ ఈఎస్ మణికంఠ

సాక్షి, నరసరావుపేట/నరసరావుపేట టౌన్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం పాలసీలో తెలుగు తమ్ముళ్ల హవా కనిపించింది. పారదర్శకంగా పాలసీ తీసుకొచ్చామని ప్రభుత్వం చెప్పిన మాటలు నీటమీద రాతలుగా మారాయి. లాటరీలో పాల్గొన్న వారిలో 90 శాతం మంది టీడీపీకి చెందిన వారే ఉన్నారంటే ఎంత పారదర్శకంగా లాటరీ ప్రక్రియ జరిగిందో అర్థమవుతుంది. మద్యం దుకాణాలను ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ప్రజాప్రతినిధులు పూనుకు న్నారు. ఒక్కో దుకాణానికి ఒక్కో రేటు కట్టి దుకాణదారుల నుంచి కప్పం కట్టించుకునేందుకు ఎమ్మెల్యేలు రంగం సిద్ధం చేశారు. లాటరీలో దుకాణం దక్కించుకునేది సొంత పార్టీ వారు అయినా తమ వాటా తమకు ఇవ్వాల్సిందే అని పలువురు ప్రజాప్రతినిధులు ఇప్పటికే స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. లాటరీలో దుకాణం వచ్చినందుకు సంతోషపడాలో లేక ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న వేధింపులకు బాధపడాలో అర్థంకాక సతమతమవుతున్నారు. వ్యాపారులకుఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం రక్షణ ఇస్తుందని ఎక్సైజ్ అధికారులు దరఖాస్తుల స్వీకరణ సమయంలో అభయం ఇచ్చారు. దుకాణాల కేటాయింపు పూర్తయిన గంటల వ్యవధిలోనే ప్రజాప్రతినిధుల నుంచి దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులకు బెదిరింపు కాల్స్ వచ్చాయి.

ఏడుగురు మహిళలు...తొమ్మిది దుకాణాలు

ఏడుగురు మహిళలకు తొమ్మిది దుకాణాలు దక్కాయి. అందులో ఓ మహిళ పేరిట మూడు దుకాణాలు దక్కడం విశేషం.

లాటరీ పద్ధతిన దుకాణాలు కేటాయింపు...

పల్నాడు జిల్లాలో 129 మద్యం దుకాణాలకు సోమవారం నరసరావుపేటలోని టౌన్‌హాల్‌లో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు టౌన్ హాల్‌ను సందర్శించి లాటరీ ప్రక్రియను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో ఉదయం 8 గంటల నుంచి లాటరీ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో టౌన్‌హాల్ పరిసరాల్లో సుమారు 300 మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఎక్సైజ్ ఈఎస్ మణికంఠ, ఏఈఎస్ రవీంద్ర, సీఐ సోమయ్యలతో పాటు డీఎస్పీ కె.నాగేశ్వరరావు, సీఐలు చరణ్, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి దరఖాస్తుదారులు వారి అనుచరులతో లాటరీ ప్రక్రియ నిర్వహించే టౌన్‌హాల్‌కు చేరుకున్నారు.

సగం వాటా ఇవ్వాల్సిందే....

- గురజాల నియోజకవర్గంలో మద్యం దుకాణాలు దక్కిన వారంతా 50 శాతం వాటా ఇవ్వాలని లోకల్ ప్రజాప్రతినిధి అల్టిమేటం జారీ చేశారట. ఇందులో 30 శాతం ప్రజాప్రతినిధికి కాగా మరో 20 శాతం లాటరీలో పాల్గొని దుకాణాలు దక్కని స్థానిక టీడీపీ నేతలకు ఇవ్వనున్నారట. దీన్ని వ్యతిరేకిస్తున్న వారు మంగళవారం ఉదయం ఇంటికి రమ్మని హెచ్చరికలు జారీ చేసినట్టు తెలుస్తోంది.

తెలంగాణ ఎమ్మెల్యేతో రాయభారం..

- మాచర్ల నియోజకవర్గంలో ఇతరులెవరు మద్యం వ్యాపారం చేయడానికి వీలు లేదంటూ స్థానిక ప్రజాప్రతినిధి హుకుం జారీ చేయడంతో జిల్లాలోనే అతి తక్కువ దరఖాస్తులు దాఖలయ్యాయి. ఇదితెలియని తెలంగాణకు చెందిన మద్యం వ్యాపారి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా లాటరీలో రెండు దుకాణాలు దక్కాయి. దీన్ని జీర్ణించుకోలేని స్థానిక టీడీపీ నేతలు బెదిరింపులకు దిగారు. ఎలా వ్యాపారం చేస్తావో చూస్తామని హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణ వ్యాపారి అక్కడి ప్రజాప్రతినిధితోఎమ్మెల్యేకు ఫోన్ చేయించి వ్యవహారాన్ని చక్కబెట్టాలని కోరినట్టు చర్చ జరుగుతోంది. బాగా వ్యాపారం జరిగే ఓ దేవాలయం, పర్యాటక ప్రాంతాల్లోని దుకాణాలను ప్రజాప్రతినిధి బినామీ పేర్లతో దక్కించుకున్నారట.

మాటమార్చిన ప్రజాప్రతినిధి...

- వినుకొండలో షాపులు దక్కించుకున్న వారు 75 శాతం తాను చెప్పిన వారికి ఇవ్వాలని అక్కడి ప్రజాప్రతినిధి హుకుం జారీ చేశారట. దీంతో షాపులు దక్కించుకున్న వారు 25 శాతం వాటాతో తామేమి వ్యాపారం చేయాలంటూ గగ్గోలు పెడుతున్నారు.

తమ్ముళ్లు అయినా కట్టాల్సిందే...

- సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రజాప్రతినిధి, ఆయన తనయులు దుకాణాలు ఇప్పిస్తామని పెద్ద మొత్తంలో వ్యాపారుల వద్ద నుంచి నగదు వసూలు చేశారు. ఆ విషయం అధిష్టానం వద్దకు చేరటంతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేశారు. ఇప్పుడు లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వారు లాభాల్లో 20 శాతం వాటా తమకు ఇవ్వాలని హుకుం జారీ చేశారట.



ఎమ్మెల్యే వాటా ఫిక్స్...

- పెదకూరపాడు నియోజకవర్గంలో స్థానికేతరులకు దుకాణాలు అధిక భాగంగా దక్కాయి. విజయవాడకు చెందిన ఓ మద్యం వ్యాపారికి చెందిన సిండికేట్‌కు 8 దుకాణాలు దక్కినట్టు సమాచారం. ఈయనకు స్థానిక ప్రజాప్రతినిధి మనుషులు ఫోన్ చేసి వచ్చి మాట్లాడుకోమని హెచ్చరించారని తెలియవచ్చింది. దుకాణాలు దక్కిన వారంతా పెట్టుబడి లేకుండా ప్రజాప్రతినిధికి 15 శాతం ఇవ్వాలని ఫిక్స్ చేశారట.

దుకాణదారులకు బెదిరింపులు

సిండికేట్‌లో వాటాలు రాని తెలుగు తమ్ముళ్లు, ఎప్పటినుంచో మద్యం వ్యాపారంలో పాతుకుపోయిన పార్టీ నాయకులు సిండికేట్‌ను వ్యతిరేకించి పెద్దఎత్తున దరఖాస్తులు చేశారు. లాటరీలో దుకాణాలు అధికంగా వారికే రావడంతో పరిస్థితిని గమనించిన ప్రజాప్రతినిధుల అనుచరులు లాటరీలో దుకాణాలు దక్కిన వారికి నేరుగా ఫోన్‌లు చేసి తమ నాయకుడిని కలిసి సెటిల్ చేసుకోవాల్సిందిగా హుకుం జారీ చేస్తున్నారు. మరి కొందరైతే ఆయా పోలీస్, ఎక్సైజ్ అధికారులతో బెదిరింపులకు దిగుతున్నారు.

తలపట్టుకుంటున్న ఎమ్మెల్యే...

- నరసరావుపేట నియోజకవర్గంలో మద్యం వ్యాపారుల పరిస్థితి గందరగోళంగా తయారైంది. లాటరీలో దుకాణాలు దక్కాయని ఆనందపడాలో లేక ప్రజాప్రతినిధి నుంచి వస్తున్న ఒత్తిడికి బాధపడాలో అర్థం కాక సతమతమవుతున్నారు. ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో ఆ పార్టీకి చెందిన కొందరిని సిండికేట్‌గా మార్చి ఇప్పటికే వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి మద్యం దుకాణాలకు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేయించారు. రెండు దుకాణాలు మాత్రమే వారికి దక్కాయి. నరసరావుపేటకి చెందిన మద్యం వ్యాపారుల సిండికేట్‌కు ఐదు దుకాణాలు వచ్చాయి. దీంతో వారి వద్ద నుంచి కొన్ని దుకాణాలను కైవసం చేసుకోవాలని ప్రజాప్రతినిధి వర్గం ప్రయత్నాలు చేస్తున్నాయి. దీన్ని సిండికేట్ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.


ప్రత్తిపాటి వర్గానికి భంగపాటు..

- చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రత్తిపాటి పుల్లారావు వర్గానికి చెందిన నాయకులకు ఆశించిన స్థాయిలో దుకాణాలు దక్కలేదు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మనిషిగా నియోజకవర్గంలో చెప్పుకొనే వ్యాపారి సిండికేట్‌కు 17లో 8 దుకాణాలు దక్కాయి. ఎమ్మెల్యే వర్గం అతన్ని బెదిరించి కొన్ని షాపులు తీసుకోవాలన్న ఆలోచనలో ఉన్నారట. లేదు తానే వ్యాపారం చేయాలంటే 20 శాతం లాభంలో వాటా ఇవ్వాలని ప్రతిపాదన పంపారు. ఇప్పటికే అతనికి ఫోన్‌చేసి ఎమ్మెల్యేను కలసి మాట్లాడుకోవాలని సూచించినట్టు తెలియవచ్చింది.


విస్తారంగా వర్షాలు

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

- 18 వరకు కోస్తాంధ్రలో భారీ వర్షాలు
- తీరంలో ఎగసిపడుతున్న అలలు
- బలంగా వీస్తున్న ఈదురుగాలులు
- నాలుగురోజుల వరకు వేటకు వెళ్ల వద్దంటూ మత్స్యకారులకు ఆదేశాలు
- జిల్లాలో సగటున 14.5 మి.మీ వర్షపాతం నమోదు



సూర్యలంక తీరంలో ఎగసిపడుతున్న అలలు



తీరానికి చేరిన పడవలు

బాపట్లటౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద ఉధృతికి లంక గ్రామాల్లోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో అత్యధికంగా చినగంజాం మండలంలో 34.6 మి.మీ వర్షపాతం నమోదుకాగా, అమర్తలూరులో అత్యల్పంగా 2.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఆందోళనలో అన్నదాతలు

మరో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేయడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు పూర్తిగా నష్టపోయారు. ఆ నష్టం నుంచి పూర్తిగా కోలుకోకముందే మరో అల్పపీడనం ఏర్పడి జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో రైతులు భయాందోళనకు గురౌతున్నారు. ప్రస్తుతం వరిసాగు పొట్ట, పాలుపోసుకునే దశలో ఉన్నాయి. ఈ తరుణంలో వర్షాలు కురవడం వలన గింజ తాలుగా మారే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

తీరానికి చేరిన పడవలు

అల్పపీడనం కారణంగా తీరంలో సుమారు మూడు మీటర్ల మేర అలలు ఎగిసిపడుతున్నాయి. తీర ప్రాంతాల్లో గంటకు 55 నుంచి 65 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. అప్రమత్తమైన క్షేత్ర స్థాయి మత్స్యశాఖ సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించి మత్స్యకారులను వేటకు వెళ్లకుండా నిలుపుదల చేశారు. నాలుగైదు రోజుల కిందట వేటకు వెళ్లి ఇప్పటికీ సముద్రంలో ఉన్న మత్స్యకారులను వెనక్కి పిలిచే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. జిల్లాలోని నిజాంపట్నం, ఈపూరుపాలెంలలో సుమారు 200 పడవలకు లంగర్‌వేశారు. ఈనెల 18 వరకు మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లొద్దని అధికారులు ఆదేశాలు జారీచేశారు.

అప్రమత్తంగా ఉండాలి

బాపట్ల కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో వీక్షణ సమావేశం ద్వారా మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఆర్డీవో కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 18వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలతో మత్స్యకారులు వేటకు సముద్రంలోకి వెళ్లకుండా చూడాలని చెప్పారు. ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన వారు తక్షణమే వెనుకకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. సాగర్ మిత్రలకు తక్షణమే సమాచారం పంపాలన్నారు. సముద్ర స్నానాలకు వచ్చే పర్యాటకులను తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను చీరాల, బాపట్లలో ఉంచాలని డీఆర్‌ఓను ఆదేశించారు. 19వ తేదీ వరకు అధికారులు, ఉద్యోగులు సెలవులు పెట్టరాదని, ఇప్పటికే సెలవుల్లో ఉంటే వారి సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతంలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాలను ఎంపిక చేసుకోవాలన్నారు. చెరువులు, కాల్వల గట్లు బలహీనంగా ఉండి గండ్లు పడే ప్రాంతాలను జల వనరులశాఖ అధికారులు గుర్తించాలన్నారు. సమస్య పరిష్కారానికి తాత్కాలికంగా లేదా శాశ్వత మరమ్మతు పనులపై అంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలన్నారు. నిత్యావసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు, బాపట్ల చీరాల రేపల్లె ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలి

- జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 76 వినతులు



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరించి వారి సమస్య వింటున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 76 అర్జీలను స్వీకరించారు. వాటిని జిల్లా అధికారులకు బదలాయించారు. కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో నలుమూలల నుంచి అర్జీదారులు ఇక్కడికి వస్తుంటారని అన్నారు. అటువంటి వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఆ పరిష్కారంతో అర్జీదారు సంతృప్తి చెందాలని సూచించారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కారం చూపాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తేనే ప్రాజెక్టులకు సార్థకత

నరసరావుపేట: వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం నాబార్డు ద్వారా అమలు చేసే ప్రాజెక్టులపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నాబార్డు ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో వాటర్‌షెడ్ పథకాలు, గిడ్డంగుల నిర్మాణాలు, ఎఫ్‌సీవోలు నిర్వహణ గ్రాంట్లు, విలేజ్ మార్టుల నిర్మాణాలు, మారుమూల గ్రామాల్లో మైక్రో ఏటీఎంల ఏర్పాటు, గిరిజన ప్రాంతాల్లో పండ్ల తోటల నిర్వహణ వంటి విషయాల్లో నాబార్డు సహకారం, అవసరం ఉందన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాదారులకు నాబార్డు రుణాలు అందించే విషయంలో సానుకూల నిర్ణయం కోసం రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. నాబార్డు అధికారులు అన్ని ప్రభుత్వశాఖల సమన్వయంతో పని చేయడం ద్వారా ఎక్కువ సంఖ్యలో రైతులు, మహిళలకు గ్రాంట్లు, సబ్సిడీ రుణాల వంటి ఆర్థిక ప్రయోజనాలు అందించవచ్చన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. సమావేశంలో నాబార్డు డీడీఎం శరత్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, ఎల్డీఎం రాంప్రసాద్, జిల్లా నైపుణ్యావృద్ధి అధికారి తమ్మాజీరావు, వ్యవసాయ అధికారి ఐ.మురళి, ఉద్యాన అధికారి రమణారెడ్డి, పశుసంవర్థక శాఖ అధికారి కాంతారావు, సూక్ష్మ నీటిపారుదల అధికారి ఆంజనేయులు, మత్స్యశాఖ అధికారి సంజీవరావు, సహకార అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

రెండు నెలల్లో రెండు ఉద్యోగాలు

- తెలంగాణ డీఎస్సీలో టాపర్‌గా నిలిచిన రెంటచింతల యువకుడు
- సీఎం రేవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రం అందుకున్న బాషా



రెంటచింతల: రెంటచింతలకు చెందిన షేక్ అలీం బాషా హిందీ పండిట్‌గా పనిచేస్తూ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో నల్గొండ జిల్లా స్థాయిలో హిందీలో మొదటి ర్యాంక్ సాధించి నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలిచాడు. గ్రామంలోని సుబ్బన్నతోట కాలనీకి చెందిన అలీం బాషా గత ఆగస్టు నెలలో తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన మైనార్టీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయ ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించి నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పాఠశాలలో హిందీ పండిట్‌గా ఉపాధ్యాయ వృత్తిలో చేరాడు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన డీఎస్సీకి నాన్‌లోకల్ కోటాలో నల్గొండ జిల్లాలో ప్రవేశ పరీక్ష రాశాడు. హిందీలో మొదటి ర్యాంక్ సాధించి నల్గొండ జిల్లా టాపర్‌గా నిలిచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. మంగళవారం నిర్వహించనున్న కౌన్సెలింగ్‌లో పాఠశాల కేటాయిస్తారని అలీం బాషా తెలిపాడు. రెండు నెలల వ్యవధిలో రెండు ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అలీం బాషా నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలిచాడు. బాషాను గ్రామస్తులు అభినందనలతో ముంచెత్తారు.

క్లుప్తంగా

పాత కక్షలతో వ్యక్తిపై కత్తితో దాడి

బెల్లంకొండ: పాత కక్షలతో వ్యక్తిపై మరొక వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ రాజా కథనం ప్రకారం గ్రామానికి చెందిన అశోక్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన బండారు తులశీరావు అనే వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు పేర్కొన్నారు. గత ఏడాది వీరి మధ్య ఓ విషయంలో వివాదంతో తలెత్తడంతో అశోక్ గత కొన్ని నెలల క్రితం తులశీరావుపై కత్తితో దాడికి చేశాడు. ఈ ఘటనలో తులశీరావుకు స్వల్పగాయాలయ్యాయి. వీరిద్దరిపై గతంలో కౌంటర్ కేసులు నమోదయ్యాయి. కాగా పాత కక్షలతో శనివారం రాత్రి తులశీరావు తిరిగి అశోక్‌పై దాడికి యత్నించాడు. బజారుకు వచ్చిన అశోక్‌పై కత్తితో పొడిచేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో అశోక్ కు గొంతు భాగంలో గాయాలయ్యాయి. గాయపడిన బాధితుడిని వెంటనే కుటుంబ సభ్యులు సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తీసుకువెళ్లినట్లు తెలిసింది. కాగా ఘటనపై బాధితుడు ఫిర్యాదు మేరకు తులసీరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ రాజా పేర్కొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు ఎంపిక



నరసరావుపేట రూరల్: శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని రాష్ట్ర ఖోఖో జట్టుకు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి సోమవారం తెలిపారు. ఈనెల 5వ తేదీన ప్రకాశం జిల్లా జే.పంగులూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పాఠశాల విద్యార్థి డి.రంగ మహా లక్ష్మీ ప్రతిభ కనబర్చి అండర్-18 విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 7వ తేదీ నుంచి నెల్లూరు ఏసీ రెడ్డి స్టేడియంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. తమిళనాడు కోయంబత్తూర్‌లో 16వ తేదీ నుంచి సౌత్‌జోన్ జాతీయ స్థాయి ఖేల్ ఇండియా ఖోఖో టోర్నమెంట్‌లో రాష్ట్ర జట్టుకు రంగమహాలక్ష్మీ ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

కట్టిన చిట్టీ డబ్బులు ఇప్పించండి

- ఎస్పీకి ఈశ్వర్ చిట్ ఫండ్స్ బాధితుడి వినతి
- పోలీసు సమస్యల వేదికలో 43 ఫిర్యాదులు

నరసరావుపేట: చిట్టీ డబ్బులు ఇప్పించాలని ఒకరు, ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశారంటూ మరొకరు, నమ్మించి బంగారంతో ఉడాయించాడంటూ ఇంకొకరు.. ఇలా.. ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు బాధితులు తమ సమస్యలను విన్నవించారు. సోమవారం జిల్లా కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించి 43 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టి ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధతో నిర్ణీత గడువులోగా పరిష్కరించడానికి కృషిచేయాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ శ్రీనివాసరావు

"చిట్‌ఫండ్ నుంచి నా డబ్బు ఇప్పించండి

నరసరావుపేటలోని ఈశ్వర్ చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.30 లక్షల చిట్టి పాట 40 నెలలకు గాను ప్రతి నెల రూ.75వేలు చొప్పున 20 నెలల పాటు రూ.15లక్షలు చెల్లించా. నా ఆర్థిక పరిస్థితి బాగాలేక మిగిలిన 20 నెలలకు డబ్బు చెల్లించలేకపోయా. చిట్టీ గడువు ముగిసి రెండేళ్లు అయినా ఆ కంపెనీ వారు తమకు పోవలసిన కమిషన్ తీసుకొని రావలసిన డబ్బులు ఇవ్వలేదు. ఎన్నిసార్లు అడిగినా ఎటువంటి సమాధానం ఇవ్వకుండా ఆఫీసు చుట్టూ తిప్పుకుంటున్నారు.

–మాగంటి వీరసైదులు, చింతపల్లి, కారంపూడి మండలం

ఉద్యోగం ఇప్పిస్తామని నగదు తీసుకుని మోసం

నేను ఉద్యోగ ప్రయత్నం చేస్తుండగా విశాఖపట్నం నివాసి ఎస్ కోట ఎమ్మెల్యే పీఏ అమర సర్వ దేవుళ్ళు అలియాస్ సర్వ, అతని ద్వారా హరీష్ శ్రీనివాసరావు పరిచయమయ్యారు. వారి ద్వారా శ్రీనివాసరావు పరిచయమయ్యారు. ఈ ముగ్గురూ కలిసి ఉద్యోగం ఇప్పి స్తానని రూ.10 లక్షల తీసుకొని ఉద్యోగం ఇవ్వలేదని, డబ్బులు తిరిగి ఇవ్వట్లేదు.

–దండే శివకుమార్, రంగారెడ్డిపాలెం,నరసరావుపేట మండలం

బంగారంతో ఉడాయించాడు.. చర్యలు తీసుకోండి

నేను కాటూరి హాస్పిటల్‌లో జీఎస్‌ఎంగా పనిచేస్తుండగా లింగారావు పాలెం గ్రామానికి చెందిన క్రేన్ డ్రైవర్‌గా పనిచేసే అప్పారావు నాతో పరిచయం పెంచుకొని గుణదలలో వివాహం చేసుకున్నాడు. బోయపాలెంలో కాపురం పెట్టాం. నా వద్ద బంగారం అంతా తీసుకున్నాడు, అదేమని అడిగితే అతని బంధువులు బెదిరిస్తున్నారు. చివరగా అప్పారావు గురించి విచారించగా అప్పటికే రెండు వివాహాలు జరిగినట్లు తెలిసింది. నాకు న్యాయం చేయండి.

–ఓ మహిళ, జగ్గాపురం, యడ్లపాడు"

సత్తెనపల్లిలో మహిళ పై హత్యాయత్నం

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): ప్రియురాలు కనిపించకుండా పోయిందనే అక్కసుతో ప్రియురాలి తల్లిపై కత్తితో హత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన పట్టణంలోని 2వ వార్డులో సోమవారం జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 2వ వార్డు15వ లైనుకు చెందిన రావిసూతల కరుణమ్మ కు నలుగురు కుమార్తెలు. వారిలో రెండవ కుమార్తె భారతికి 17వ వార్డు, సుందరయ్యకాలనీకి చెందిన పి.పూర్ణచంద్రరావుకు మధ్య రెండేళ్ళుగా వివాహేతర సంబంధం నెలకొంది. ఈ క్రమంలో కొద్ది రోజుల నుంచి భారతి కనిపించకుండా పోవటంతో పూర్ణచంద్రరావు 2 వార్డులో ఉంటున్న కరుణమ్మ ఇంటికి వెళ్ళి నీ కూతుర్ని ఎక్కడ దాచి పెట్టావు అంటూ మంచం పై నిద్రిస్తున్న మహిళ పై కత్తితో దాడి చేశాడు. దాడిలో కరుణమ్మ తలకు, కుడిచేతిపై, ఎడం చేతిపై, పొట్టపై బలమైన గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. గతంలోను కరుణమ్మ పై పూర్ణచంద్రరావు చేసిన దాడిలో కుడి చేయి విరిగింది. అనంతరం ఇరువురు రాజీ చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరి, బాధితురాలి నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. జరిగిన సంఘటనపై కరుణమ్మ ఫిర్యాదు మేరకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ బ్రహ్మయ్య తెలిపారు. హత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కరుణమ్మ

జిల్లాలో 254.2 మిల్లీ మీటర్ల వర్షం

అత్యధికంగా ముప్పాళ్లలో 45.6 మి.మీ

నరసరావుపేట: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అవి జల్లుల దగ్గర నుంచి భారీ వర్షాలుగా పడ్డాయి. జిల్లాలో 28 మండలాలు ఉండగా సోమవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 7.30వరకు ఒక్క అచ్చంపేట మండలం మినహా మిగతా 27 మండలాల్లో 254.2 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని అధికారులు తెలియచేశారు. అత్యధికంగా ముప్పాళ్లలో 45.6 మి.మీటర్ల వర్షం నమోదైంది. మాచర్లలో 0.8 మి.మీ., వెల్దుర్తి లో 0.6, దుర్గిలో 1.2, రెంటచింతలలో 0.4, గురజాలలో 1.4, దాచేపల్లిలో 1.8, కారెంపూడిలో 1.2 మి.మీ వర్షం కురిసింది. అలాగే పిడుగురాళ్లలో 2.2, మాచవరంలో 1.2, బెల్లంకొండలో 3.4, క్రోసూరులో 3.2, అమరావతిలో 2.4, పెదకూరపాడులో 3.0, సత్తెనపల్లిలో 4.4, రాజుపాలెంలో 3.0, నకరికల్లులో 2.2, బొల్లాపల్లిలో 8.4, వినుకొండ లో 25.4, నూజెండ్లలో 26.8, శావల్యాపురంలో 10.6, ఈపూరులో 28.6, రొంపిచర్లలో 8.2, నరసరావుపేటలో 9.8 మి.మీ వర్షం కురిసింది. అలాగే నాదెండ్లలో 19.0, చిలకలూరిపేటలో 23.2, యడ్లపాడులో 16.2 మి.మీటర్ల వర్షం కురిసింది.

ఎన్‌జీ రంగా సాహిత్య పురస్కారం విజేతలు వీరే..

నగరంపాలెం: ఆచార్య ఎన్‌జీ రంగా ఫౌండేషన్ – 2024 సాహిత్య పురస్కారాల ఎంపిక పూర్తయినట్లు అధ్యక్షులు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయ నిర్ణేతల సూచన మేరకు వి.శాంతి ప్రబోధ రచించిన 'బతుకు సేద్యం' నవలకు ప్రథమ బహుమతి (రూ.10 వేలు), ద్వితీయ బహుమతిని పి.సుజాత రాసిన 'పచ్చబొట్టు' నవలకు (రూ.5 వేలు), విశిష్ట బహుమతిగా 'నీలంపు రాసి' నవల రచయిత్రి చంద్రలతను ఎంపిక చేశామని తెలిపారు.

బస్సుల కోసం పడిగాపులు

- హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు
- గ్రామాలకు వెళ్లే బస్సులలో కోత

నరసరావుపేట: దసరా పండగ ముగిసింది. పండగను పురస్కరించుకొని తమ సొంత గ్రామాలకు వచ్చిన వారు తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం విద్యాసంస్థలు, కార్యాలయాలు తెరవటంతో విద్యార్థులు, ఉద్యోగులు ఆయా కేంద్రాలకు పయనమయ్యారు. అయితే ఆర్టీసీ డిమాండ్‌కు తగినట్లుగా బస్సులను ఏర్పాటు చేయకపోవటంతో స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా బస్టాండ్ నుంచి గుంటూరు, విజయవాడ వెళ్లేందుకు తగిన బస్సులు లేవు. ఈ మార్గంలో తిరిగే బస్సులను హైదరాబాదుకు ప్రత్యేక బస్సులుగా ఏర్పాటు చేయటంతో బస్సుల కొరత ఏర్పడింది. దీంతో బస్సులు లేక గంటల తరబడి ఎదురుచూస్తున్నారు. గుంటూరు వైపు వెళ్లే బస్సులు రాగానే జోరున కురుస్తున్న వర్షాన్ని లెక్కచేయకుండా బస్సుల వెంట పరిగెత్తి సీట్లు ఆపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వందలమంది ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు కాయటం కన్పించింది. ఆర్టీసీ అధికారులు తమకేమీ పట్టనట్లు వివరిస్తున్నారనే విమర్శలు ప్రయాణికుల నుంచి వ్యక్తమౌతున్నాయి.



బస్సుల కోసం బస్టాండ్‌లో వేచి చూస్తున్న ప్రయాణికులు

గోవా పోటీలకు గుంటూరు క్రీడాకారుల ఎంపిక

తాడేపల్లి రూరల్: గోవాలో జరిగే నేషనల్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ టీమ్‌లో జిల్లాకు చెందిన ముగ్గురు పవర్ లిఫ్టర్లు ఎంపికై నట్లు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని సంయుక్తంగా తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మెన్ జూనియర్ బెంచ్ ప్రెస్‌కు రమేష్ శర్మ (జూనియర్), ఉమెన్ బెంచ్ ప్రెస్‌కు కాంతకుమారి (మాస్టర్స్-1), జ్యోతి వర్మ (మాస్టర్స్-2)లు ఎంపికయ్యారని తెలిపారు. మెన్ జూనియర్ 74 కేజీల విభాగంలో రమేష్ శర్మ, 76 కేజీల విభాగంలో కాంత కుమారి, 69 కేజీల విభాగంలో జ్యోతివర్మ ఈనెల 14వ తేదీ నుంచి 18 వరకు గోవాలో జరిగే పోటీల్లో పాల్గొనన్నున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ వంశీకృష్ణ, కోశాధికారి జి. వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లు బి.ప్రసాద్ పాల్గొన్నారు.



క్రీడాకారులు రమేష్‌శర్మ, కాంత కుమారి, జ్యోతి వర్మలతో కార్యవర్గం

అల్పపీడనం.. అధిక ప్రభావం

- భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన నారుమళ్లు, పైర్లు
- చినగంజాం మండలంలో 34.6 మి.మీ వర్షం

సాక్షినెట్ వర్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అల్పపీడనం కారణంగా కురిసిన వర్షంతో పర్చూరు, చీరాల, అద్దంకి నియోజకవర్గాల్లో పలు వీధులు జలమయం అయ్యాయి. రోడ్ల మీద వర్షపు నీరు ప్రవహించడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చీరాల పట్టణంలోని సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి రోడ్డులో మోకాలు లోతులో వర్షపునీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వేటపాలెం మండలంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలు రైతులను నిండా ముంచాయి. వరి పంట సాగు కోసం కొంత మంది రైతులు నారుమడులు, మరి కొంతమంది నాట్లు వేశారు. అయితే ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో నారుమళ్ల వర్షం నీటిలో మునిగాయి. ఇసుక భూముల్లో సాగు చేసిన మినిము పైరు కోసి ఓదెల మీద ఉండటంతో వర్షానికి పూర్తిగా తడిసిపోయింది.



ఉధృతంగా వర్షపు నీటితో ప్రవహిస్తున్న ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ

చినగంజాంలో అత్యధిక వర్షపాతం..

తుఫాన్ కారణంగా బాపట్ల జిల్లాలో అత్యధికంగా చినగంజాం మండలంలో 34.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలలో నీరు వచ్చి చేరింది. రోడ్లపై నీరు ప్రవహించడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పర్చూరు మండలం పూసపాడు వద్ద కప్పల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పర్చూరు ఇంకొల్లు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది.

టీడీపీ వర్గీయులపై కేసు నమోదు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కేఎన్‌పీఎస్, ప్రజాసంఘాల నాయకులు, బాధితులు

- బాధితులపై పెట్టిన కేసును రద్దు చేయాలి
- రెడ్‌బుక్‌కు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలి
- కలెక్టరేట్ ఎదుట ధర్నాచేసిన ప్రజాసంఘాల నాయకులు
- జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలు అందజేత

నరసరావుపేట: పెదకూరపాడు మండలం లగడపాడులో గతనెల 9వ తేదీన వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా పల్లె యువకులు యర్రగొర్ల నరసింహారావు, పల్లం ఏసుపాదంలపై దాడులకు పాల్పడిన టీడీపీ నాయకులు రావెల మనేష్, బుచ్చయ్యచౌదరి అండ్ గ్యాంగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత యువకులు 17 మందిపై పెట్టిన తప్పుడు కేసును రద్దు చేయాలని కుల నిర్మూలనా పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట కేఎన్‌పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి ధర్నాచేసి కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాసరావులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో దళిత పల్లెల ప్రజలపై అమలౌతున్న అధికార పార్టీ రెడ్‌బుక్ (దాడులు, దౌర్జన్యాలు కక్షసాధింపు చర్యలు) రాజ్యాంగానికి వ్యతిరేకంగా బాధిత గ్రామాల ప్రజలు సంఘటితంగా పోరాడాలని పిలుపు ఇచ్చారు. అధికార మదంతో మాల, మాదిగ పల్లెలపై టీడీపీకి చెందిన వ్యక్తులు దాడులు చేస్తున్నారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో పోలీసు అధికారులపై ఒత్తిడి పెంచి బాధితులపై తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారని మండిపడ్డారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి దళిత యువకులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి బాధితులపై పెట్టిన తప్పుడు కేసును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, కులనిర్మూలనా పోరాట సమితి ప్రకాశం జిల్లా కమిటీ అధ్యక్షులు ఓర్సు శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్. రాజశేఖర్, నాగి పోగు శ్రీను, ఖాశీం, రాపూరి రవి పాల్గొన్నారు.

ఉద్యోగానికి వన్నె తీసుకొచ్చిన రామచంద్రరాజు

ఎస్పీగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న రామచంద్రరాజుకు ఘనంగా వీడ్కోలు

నరసరావుపేట: పోలీస్ ఉద్యోగం ఇతర ఉద్యోగాల లాంటిది కాదని, ఎన్నో కష్ట నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితుల్లో ఉన్నతమైన సేవలను అందించి అందరికీ ఆదర్శవంతంగా రామచంద్రరాజు నిలిచారని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కొనియాడారు. జిల్లా అదనపు ఎస్పీ (ఆర్మ్ డ్ రిజర్వ్)గా విధులు నిర్వహిస్తూ ఎస్పీగా పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న రామచంద్రరాజును సోమవారం కార్యాలయంలో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేసి వీడ్కోలు పలికారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 1991లో పోలీసు శాఖకు ఎంపికై ఉమ్మడి రాష్ట్రంలోని పలు చోట్ల విధులు నిర్వహించి, పల్నాడు జిల్లా అదనపు ఎస్పీగా రెండున్నరేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారన్నారు. నీతి, నిజాయితీలతో పాటు క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా తనకు అప్పగించిన బాధ్యతలను తూచా తప్పకుండా పాటించిన వ్యక్తిగా కొనియాడారు. ఎస్పీ రామచంద్రరాజు చూసి ఇప్పుడున్న ప్రతి పోలీస్ సిబ్బంది నేర్చుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయన్నారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. శాంతి భద్రతల విభాగ అదనపు ఎస్పీ సీహెచ్.లక్ష్మీపతి, పరిపాలన విభాగం అదనపు ఎస్పీ జేవీ సంతోష్, డీఎస్పీ కె.వి.నాగేశ్వరరావు, ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ గాంధీరెడ్డి, సీఐలు,ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



రామచంద్రరాజును సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీలు

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఆటో డ్రైవర్ మృతి

పిడుగురాళ్ల: ఆటోను వేగంగా బస్సు ఢీకొనటంతో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజామున పట్టణ సమీపంలోని అయ్యప్ప నగర్ సమీపంలోని పెద్ద కాలువ సమీపంలో జరిగింది. సంఘటనకు సంబంధించి పట్టణ ఎస్ఐ మోహన్ తెలిపిన వివరాల మేరకు... పట్టణ సమీపంలోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద ఆటో బ్రాహ్మణపల్లి వైపు యూటర్న్ తీసుకుంటుండగా పిడుగురాళ్ల వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కందుకూరు డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వేగంగా ఆటోను ఢీకొనటంతో ఆటో నడుపుతున్న బ్రహ్మణపల్లి గ్రామానికి మల్లబంటు లక్ష్మయ్య (40) అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ ఎం మోహన్ సంఘటనా స్థలాన్ని చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఆటోలో ప్రయాణికులు ఎవరు లేకపోవటంతో ఆటో డ్రైవర్ మాత్రమే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ తెలి పారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మోహన్

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ఏపీసీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ పర్యవేక్షణ ఇంజినీర్ మూర్తి

కొరిటెపాడు(గుంటూరు): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా విద్యుత్ ప్రమాదాల నుంచి అప్రమత్తంగా ఉండాలని ఏపీసీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ పర్యవేక్షణ ఇంజినీర్ కె.వి.ఎల్.ఎస్.మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్లు తెగిపడితే వాటిని తాకకుండా వెంటనే కంట్రోల్ రూం నంబర్ : 9440817526, టోల్ ఫ్రీ నంబర్ : 1912కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. గుంటూరు సర్కిల్ ఆకార్యాలయం విద్యుత్ భవన్‌లో కంట్రోల్ రూమ్ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తడిచిన విద్యుత్ స్తంభాలను తాకవద్దని ఆయన సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మంటలు, శబ్దం వస్తే కంట్రోల్ రూంకు తెలియజేయాలని కోరారు. భారీ వర్షాల కారణంగా తేమ ఎక్కువగా ఉండటం వల్ల ఇళ్లలో మోటార్ స్విచ్‌లు, విద్యుత్ పరికరాలు వినియోగించేటప్పుడు ప్రమాదాలు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తడి వస్త్రాలు ఆరవేసే తీగలు కరెంట్ స్తంభాలు, తీగలకు తగలకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు. తెగిపడిన లైన్లు, పాడైపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సిబ్బంది కూడా తక్షణం మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించాలని ఆయన ఆదేశించారు.